క్లుప్తంగా

రోడ్ల అభివృద్ధికి కార్యాచరణ

మామిడికుదురు: టూటుకుర్రులో రహదారుల అభివృద్ధికి కార్యాచరణ చేపట్టామని సర్పంచ్ అడబాల తాతకాపు తెలిపారు. గ్రామంలోని 2, 6 వార్డుల్లో మండల పరిషత్, పంచాయతీ నిధులు రూ.నాలుగు లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ కాంక్రీట్ రోడ్లను ఆయన మంగళవారం పరిశీలించారు. తాతకాపు మాట్లాడుతూ పూర్తిగా పాడైపోయిన రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, పంచాయతీ సభ్యుడు బోణం కొండ, రొక్కం తేజేశ్వరరావు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ హోంకు పరుపులు, దిండ్ల పంపిణీ



పరుపులు, దిండు అందిస్తున్న దాతలు తాడి సూర్యం బాబు,ఝాన్సీ

మలికిపురం: విశ్వేశ్వరాయపురంలోని డిస్ప్రింగ్ చిల్డ్రన్స్ హోంలో చదువుకుంటున్న పేద విద్యార్థుల కోసం స్థానిక పాస్టర్ తాడి సూర్యం బాబు, ఝాన్సీ(లైబ్రేరియన్) దంపతుల పెళ్లి రోజును పురస్కరించుకొని పరుపులు, తల దిండ్లు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ విద్యార్థులు సూర్యం బాబు–ఝాన్సీలతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. దాతల సేవను సంస్థ నిర్వాహకులు అభినందించారు.

కుమ్మర శాలివాహనులను ఆదుకున్నది వైఎస్సారే



మాచవరంలో కుమ్మర శాలివాహన సమావేశంలో పాల్గొన్న నాయకులు

అంబాజీపేట: కుమ్మర శాలివాహనులకు రెండు సార్లు ఎమ్మెల్సీ, ఒక ఎమ్మెల్యే ఇచ్చి అన్ని విధాలా అండగా ఉన్నది దివంగత డాక్టర్ వైఎస్సారేనని అని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కుమ్మరి శాలివాహన సంఘ మాజీ అధ్యక్షుడు మానేపల్లి వీరబ్రహ్మం అన్నారు. మాచవరంలో వీరబ్రహ్మం ఆధ్వర్యంలో కోనసీమ జిల్లా సమావేశం మంగళవారం జరిగింది. పలువురు వక్తలు మాట్లాడుతూ వైఎస్సార్ హయాంలో కుమ్మరి శాలివాహనులకు ఫెడరేషన్ ఏర్పాటు చేశారని ఆయన సేవలు ఇప్పటికీ మరువలేమన్నారు. కుమ్మరి శాలివాహనులకు ఏటా రూ.పదివేలు ఇచ్చి తమ కుటుంబాలను ఆదుకోవాలన్నారు. అలాగే పలు సమస్యలను ప్రస్తావించారు. త్వరలో 22 మండలాల్లో సంఘాన్ని బలోపేతం చేయడం, నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయడం తదితర అంశాలపై తీర్మానం చేశారు.

డీసీసీబీ మేనేజర్‌గా నాగేశ్వరరావు

అంబాజీపేట: స్థానిక జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మేనేజర్‌గా బి.నాగేశ్వరరావు మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు ఆయన మామిడికుదురు డీసీసీబీఓ అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ మేనేజర్‌గా పదోన్నతి పొంది ఇక్కడకు వచ్చారు. ఇంత వరకు ఇక్కడ పనిచేసిన పీతల శ్రీనివాస్ కాట్రేనికోన డీసీసీబీ మేనేజర్‌గా బదిలీ అయ్యారన్నారు. ఖాతాదారులు, ప్రజలు, సిబ్బంది సహకారంతో డీసీసీబీని మరింత అభివృద్ధి చేస్తానన్నారు.

నేడు ఏపీఈపీడీసీఎల్ అవగాహన సదస్సు

రాజోలు: ఏపీఈపీడీసీఎల్ కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ ఫోరమ్ (సీజీఆర్ఎఫ్) కార్యక్రమం బుధవారం రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ సీహెచ్ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు జరిగే సదస్సుకు విద్యుత్ వినియోగదారులు హాజరుకావాలని కోరారు.

ఏఐఎస్ఎఫ్ బంద్ విజయవంతం

రాజోలు/మలికిపురం: విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం రాజోలు, మలికిపురం మండలాల్లో చేపట్టిన బంద్ విజయవంతమైంది. ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకుడు దేవ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్పొరేట్ కళాశాలల్లో ఫీజులు తగ్గించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. రాజోలు మండల అధ్యక్షుడు ఉండ్రు ప్రశాంత్, నాయకులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మలికిపురం: మండలంలోని కేశనపల్లి ప్రభుత్వం జూనియర్ కళాశాలలో అతిథి(గెస్ట్) లెక్చరర్ల పోస్టుల భర్తీ కొరకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ వై.లక్ష్మణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భౌతిక శాస్త్రం, వృక్షశాస్త్రం సబ్జెక్టుల బోధనకు 50 శాతం గ్రాడ్యుయేషన్ మార్కులు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పదవీ విరమణ చేసిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 26వ తేదీ లోపు దరఖాస్తులను అందించాలన్నారు.

సమస్యల పరిష్కారానికే సురక్ష పథకం

- ఎమ్మెల్యేలు చిట్టిబాబు, జగ్గిరెడ్డి
- లబ్ధిదారులకు ధ్రువపత్రాల పంపిణీ



వాకలగరువులో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



ఆత్రేయపురంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

అంబాజీపేట: సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. వాకలగరువులో ఎంపీడీఓ కె.సత్యనారాయణ పర్యవేక్షణలో సర్పంచ్ మద్దింశెట్టి దొరబాబు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి పథకాలు అందించేందుకే జగనన్న సురక్ష సభలను నిర్వహిస్తున్నామన్నారు. 16 గ్రామాల్లోనూ కుల, ఆదాయ, కౌలు, మ్యుటేషన్ తదితర ధ్రువపత్రాల కోసం 22,869 మంది దరఖాస్తు చేసుకోగా 22,394 మంది లబ్ధిదారులకు జగనన్న సురక్ష ద్వారా లబ్ధిదారులకు పత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, ముత్తాబత్తుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాజులపాలెంలో..

పి.గన్నవరం: జగనన్న సురక్ష ద్వారా సంక్షేమ పథకాలకు అవసరమైన ధ్రువీకణ పత్రాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. రాజులపాలెం, పోతవరం గ్రామాల్లో సర్పంచ్‌లు కొంబత్తుల ఏసు బాబు, వడలి కొండయ్యల అధ్యక్షతన మంగళవారం జరిగిన జగనన్న సురక్ష సభల్లో చిట్టిబాబు మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించాలన్న లక్ష్యంతో సీఎం జగన్ పనిచేస్తున్నారని అన్నారు. పలువురికి ధ్రువపత్రాలు అందజేశారు. ఎంపీపీ అంబటి భూలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నక్కా కృష్ణవేణి, తహసీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీటీసీ పులపర్తి రాజారావు, నాయకులు నక్కా వెంకటేశ్వరరావు, గోపి, దొమ్మేటి దుర్గారావు, గుత్తుల మధు తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: ఏ పేద కుటుంబం కూడా ప్రభుత్వం నుంచి లబ్ధి పొందకుండా ఉండకూడదనే లక్ష్యంతో సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆత్రేయపురంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 11 రకాల సర్టిఫికెట్లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా చేపట్టిన జగనన్న సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జగనన్న సురక్ష ద్వారా నియోజకవర్గంలో సుమారు 90 వేలు పైనే సర్టిఫికెట్లు ఇప్పటి వరుకు ప్రజలకు ఉచితంగా అందించినట్లు తెలిపారు. తొలిత రావిచెట్టు సెంటర్ వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బోణం సాయిబాబా, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, మండల పార్టీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, ఎంపీటీసీలు చిలువూరి బాబిరాజు, సరెళ్ల ధనలక్ష్మి, సర్పంచ్ గెడ్డం సుధ, ఎంపీడీఓ నాతి బుజ్జి, తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్, ఈవోపీఆర్డీ యు.చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీధర్, హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న జగనన్న సురక్ష

ఆలమూరు: మండలంలో ఈనెల ఒకటిన ప్రారంభమైన జగనన్న సురక్ష పథకం బుధవారంతో ముగియనుందని ఇన్‌చార్జిలు తమ్మన శ్రీనివాసు, నామాల శ్రీనివాసు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ నేతృత్వంలో గుమ్మిలేరు, చొప్పెల్ల–3 (నవాబుపేట) గ్రామ సచివాయాల్లో శిబిరాలను ఏర్పాటు చేయనున్నారన్నారు. అర్హులైన లబ్ధిదారులు సంక్షేమ పథకాల మంజూరు కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ధ్రువపత్రాలను మంజూరు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

రాజోలు: మండల పరిధిలో ఖాళీగా ఉన్న ఏడు వలంటీర్ పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజోలు–3 బీసీ–బీ (మహిళ), చింతలపల్లి–1 జనరల్, ములికిపల్లి బీసీ–బీ (మహిళ), శివకోడు–1 ఎస్సీ, తాటిపాక–1 బీసీ–ఏ, చింతలపల్లి–2లో రెండు పోస్టుల్లో ఎస్సీ, జనరల్ మహిళకు కేటాయించారు. ఈ నెల 27 లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసి ఆ ప్రతులను ఆయా సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు అందజేయాలన్నారు.

డెంగీ నివారణకు కృషి చేయాలి

ఆలమూరు: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సీజనల్‌గా సంభవించే డెంగీ నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించాలని జిల్లా మలేరియా యూనిట్ అధికారి సత్యనారాయణ కోరారు. డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పెదపళ్ల పీహెచ్‌సీలో వైద్యాధికారి పి.భవానీశంకర్ ఆధ్వర్యంలో డెంగీ నివారణ–వైద్యారోగ్య సిబ్బంది పాత్రపై అవగాహన సదస్సు జరిగింది. డెంగీ నిర్మూలనకు తీసుకోవలసిన చర్యలపై వైద్యారోగ్య సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెచ్‌ఈ ఏవీవీ రాజా అక్కుల, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, పి.ఉమ, ల్యాబ్ టెక్నీషియన్ పీఆర్ రమేష్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వీడని ముసురు.. వదలని వర్షం..

మామిడికుదురు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి మామిడికుదురు మండలంలో భారీ వర్షం కురుస్తోంది. ఏకధాటిగా వర్షం కురుస్తుండడంతో పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొగలికుదురు, గెద్దాడ, పెదపట్నం, మామిడికుదురు, నగరం, పాశర్లపూడి, అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, లూటుకుర్రు, ఆదుర్రు, మాకనపాలెం, మగటపల్లి, ఈదరాడ తదితర గ్రామాల్లోని రోడ్లపై ముంపునీరు భారీగా నిలిచిపోయింది. కాలనీల్లో వర్షం నీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరం నుంచి పాశర్లపూడిబాడవ వరకు జాతీయ రహదారిపై భారీగా ముంపునీరు నిలిచిపోయింది. దీంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక తదితర గ్రామాల్లో ముంపునీరు నిలిచిపోయింది. ఈ ముంపునీరు ఎటూ వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం

పి.గన్నవరం: అల్పపీడన ప్రభావంతో మండలంలో మంగళవారం కూడా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. జనం ఇళ్లకే పరిమితమయ్యారు. రహదారులు, లోతట్టు ప్రాంతాల కాలనీలను వర్షపునీరు చుట్టుముట్టింది. బయటకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



బి.దొడ్డవరంలో రోడ్డుపై నిలిచిన ముంపునీరు

కొనసాగుతున్న ముసురు

కొత్తపేట: గత మూడు రోజులుగా ఒక మోస్తరుగా వర్షం కురుస్తూనే ఉంది. మంగళవారం ఉదయానికి 24 గంటలకు 20.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మరో నాలుగు రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. కాలువలకు పుష్కలంగా నీరు వదలడం, వర్షాలతో ముసురు పట్టిన నేపథ్యంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా చేపట్టారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆర్డీఓ పర్యటన

అయినవిల్లి: మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి మంగళవారం పర్యటించారు. ఆర్డీఓ ముక్కంటి మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాలైన వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, పొట్టిలంకల్లో ఎస్‌డీఆర్‌ఎఫ్ చెందిన మూడు బృందాల వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు. 42 మంది బృంద సభ్యులు ఉన్నాయన్నారు. వరదకు ముంపుకు గురైన ప్రాంతాల్లో ఈ బృందాలు ఎప్పటికప్పుడు పర్యటిస్తూ సహాయక చర్యలు చేపడతాయన్నారు. వరద పరిస్థితులపై అధికారులను ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ ప్రజలకు సేవలందిస్తున్నామన్నారు. ఆయన వెంట డీటీ తహసీల్దార్ అశోక్ తదితరులు ఉన్నారు.



వీరవల్లిపాలెంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో ఆర్డీఓ ముక్కంటి

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

మామిడికుదురు: విద్యార్థులు పట్టుదలతో ఆడి క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అభిలాషించారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ సహకారంతో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో గత నెలలో పలువురికి బాక్సింగ్‌లో శిక్షణ ఇచ్చారు. నగరంలో మంగళవారం ఎమ్మెల్యే స్వగృహం వద్ద జరిగిన సమావేశంలో బాక్సింగ్‌లో శిక్షణ పొందిన క్రీడాకారులకు చిట్టిబాబు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవయువ క్రీడా యువజన సేవా సంఘం ద్వారా ఏటా ఔత్సాహికులకు బాక్సింగ్‌లో శిక్షణ ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన యువకులు బాక్సింగ్‌లో రాణించి పతకాల పంట పండిస్తున్నారని చెప్పారు. విద్యార్థులను ఎమ్మెల్యే చిట్టిబాబు అభినందించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి బొంతు మధుకుమార్, క్యాంప్ ఆర్గనైజర్ బొంతు చంద్రశేఖర్, లంకే ఏసు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

సాయిబాబా మందిరంలో చోరీకి విఫలయత్నం



ఆలయ తలుపులు పగలగొట్టిన దృశ్యం

పి.గన్నవరం: స్థానిక అక్విడెక్టు వద్ద వేంచేసిన షిర్డీ సాయిబాబా వారి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు వ్యక్తి చోరీకి ప్రయత్నించి, విఫలమయ్యాడు. తలుపులు తెరుచుకోక పోవడంతో పలాయనం చిత్తగించాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అవ్వకుండా, వాటిని పక్కకు తిప్పాడు. అయితే బాబా ఆలయంలో ప్రవేశించిన దృశ్యాలను పక్కనే ఉన్న పంచ ముఖ ఆంజనేయ స్వామి ఆలయ సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. బాబావారి ఆలయం తలుపులు బద్దలు గొట్టి ఉండటాన్ని గమనించిన కమిటీ సభ్యులు మంగళవారం ఉదయం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. ఆంజనేయ స్వా మి ఆలయ డిబ్బీని పగలగొట్టి రూ.5000, పక్కనే ఉన్న కూరగాయల షాపులోని కొంత నగదును గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. ఆ దృశ్యాలు కూడా రికార్డు అయ్యాయి. అక్కడ చోరీకి పాల్పడిన వ్యక్తి షిర్డీ సాయిబాబా ఆలయం తలుపులు పగులగొట్టినట్టు భావిస్తున్నారు. వరుసగా దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్వల్పంగా తగ్గుముఖం పట్టిన వరద

పి.గన్నవరం: మండలంలోని వశిష్ట, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలతో పాటు, ఉభయ గోదావరి జిల్లాల సరిహద్దులో ఉన్న పెదమల్లంక, ఆనగర్లంక గ్రామాల ప్రజలు పడవలపై బయటి గ్రామాలకు వస్తున్నారు. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వే వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. వరదలు, వర్షాలతో లంక గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లంక గ్రామాల ప్రజల కోసం రేవుల్లో ప్రభుత్వం ఇంజిన్ బోట్లు ఏర్పాటు చేసింది. అధికారులు సహాయక కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

రావులపాలెం/అయినవిల్లి/ఆలమూరు: గత ఐదు రోజులుగా సాగిన వరద గోదావరి ప్రవాహం మంగళవారం తగ్గుముఖం పట్టింది. మండలంలోని గౌతమి, వశిష్ట గోదావరి పాయల్లో మాత్రమే వరద నీరు పారుతుంది. అయినవిల్లి మండలం ముక్తేశ్వరంలోనూ వరద ఉధృతి తగ్గింది. ఆలమూరు మండలం జొన్నాడలో పుష్కరఘాట్‌ను ఆనుకుని వరద పరవళ్లు తొక్కుతూ ప్రవహించింది.



బూరుగులంకలో పడవపై వెళ్తున్న లంక ప్రజలు

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

సఖినేటిపల్లి: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా ఉన్నాయని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం మోరిపోడులో ఎమ్మెల్యే రాపాక అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం జగన్ సమర్థవంతమైన దూరదృష్టి ఉన్న నాయకుడని కూడా ఆయన అన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని, ఆయనకు తోడుగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాజోలు ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, పీఏసీఎస్ అధ్యక్షుడు ముప్పర్తి త్రిమూర్తులు, నాయకులు గుబ్బల మనోహర్, గెడ్డం అమ్ములు, కొల్లాబత్తుల అశోక్ పాల్గొన్నారు.



మోరిపోడులో ప్రజలకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక

బీసీ యువసేన మహిళా అధ్యక్షురాలిగా భారతి

అంబాజీపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బీసీ యువసేన మహిళా అధ్యక్షురాలిగా మొసలపల్లి గ్రామానికి చెందిన మట్టపర్తి భారతి నియమితులయ్యారు. ఢిల్లీలో బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మంగళవారం నియామక పత్రాన్ని అందించినట్లు భారతి తెలిపారు. పార్లమెంటులో మహిళా బిల్లు ఆమోదించాలంటూ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో భారతి పాల్గొనడం అభినందనీయమని కృష్ణయ్య ప్రశంసించారన్నారు. జిల్లా అధ్యక్షురాలిగా తనను నియమించడంపై కృష్ణయ్యతో పాటు బీసీ సంఘ నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి

ఆత్రేయపురం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఎంపీడీఓ నాతి బుజ్జి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీపీ కార్యాలయం వద్ద అధికారులతో సమీక్ష నిర్వహించారు. అధిక వర్షాల వలన వరదలు రావడంతో వలంటీర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు కలసి ఏటిగట్లను పరిశీలించి ఎక్కడైనా బలహీనంగా ఉంటే మండల స్థాయి అధికారులకు సమాచారం అందించాలన్నారు.

రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించండి

అయినవిల్లి: రోగులను, గర్భిణులను వరద ప్రభావిత ప్రాంతాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎం.దుర్గారావు దొర వైద్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని వరద గ్రామాలైన అయినవిల్లిలంక, చింతనలంక, మడుపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను సందర్శించారు. గ్రామంలో ఉన్న గర్భిణులు, బాలింతలు, బెడ్ రిడెన్ రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వరద గ్రామాల్లోని ప్రజలు కాచి చల్లార్చిన నీరు తాగాలని, జ్వరాలు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరాల బారిన పడ్డవారు, రక్త పరీక్ష చేయించుకుని వైద్యుల సూచించిన మందులు వాడాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలను రోజూ ఏఎన్ఎం, ఆశావర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు సందర్శించి వైద్య సేవలు చేయాలని ఆదేశించారు. అనంతరం అయినవిల్లి పీహెచ్‌సీని విజిట్ చేసి వైద్య సేవలు పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. రోగులకు మెరుగైన సేవలు అందివ్వాలని, అన్ని సేవలను ఆన్‌లైన్ చేయాలని, ప్రసవాల సంఖ్యను పెంచాలని వైద్యాధికారి మంగాదేవికి సూచించారు. ఆయన వెంట సీహెచ్‌ఓ రాంబాబు, ఎంపీహెచ్‌ఈఓ ఆర్.రామకృష్ణమూర్తి, వైద్య సిబ్బంది ప్రసాద్ తదితరులు ఉన్నారు.



మడుపల్లిలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎం.దుర్గారావు దొర

బాధ్యులను కఠినంగా శిక్షించాలి

కొత్తపేట: మణిపూర్‌లో క్రైస్తవులపై దాడి చేసిన బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రవచన దేవుని సంఘం, యెరూషలేము చర్చ్ పాస్టర్, ఎవాంజెలికల్ పాస్టర్స్ ఫెలోషిప్ నిర్వాహకుడు బిషప్ జి.అబెద్నగో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ దేశంలో పౌరులంతా సమానమేనని అలాంటప్పుడు కులాలు, మతాల పరంగా వేరు చేసి దాడులు చేయడం, అత్యాచారాలకు పాల్పడటం హేయమైన చర్య అన్నారు. దీనిపై రాష్ట్రపతి జోక్యం చేసుకుని క్రైస్తవులకు రక్షణ కల్పించాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరక్కుండా చర్యలు తీసుకోవాలన్నారు.

సీఎం నైతిక బాధ్యత వహించాలి

రాజోలు: గిరిజన మహిళలపై జరిగిన దాడులకు నైతిక బాధ్యత వహిసూ మణిపూర్ సీఎం రాజీనామా చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పీతల రామచంద్రరావు ఆధ్వర్యంలో తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందజేశారు.

అనారోగ్య బాధితుడికి ఎమ్మెల్యే సాయం

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న రావులపాలెం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన మద్దింశెట్టి పరదేశినాయుడుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి రూ.15 వేలు ఆర్థికసాయం అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యే స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఈ సాయాన్ని ఆయన అందజేశారు.



బాధితుడికి సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి